- ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్‌ను పట్టించుకోలేదు..
- కేంద్రీయ, నవోదయ పాఠశాల, సైన్స్ సెంటర్ కావాలన్నా అతీగతీ లేదు..
- అభివృద్ధి, సంక్షేమమే నా గెలుపునకు నాంది
- నిర్మల్ ప్రజలు మళ్లీ నన్నే ఆశీర్వదించబోతున్నారు
- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

# బీజేపీతో నయాపైసా లాభం లేదు..

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW



నిర్మల్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : నిర్మల్ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు, వారి అండదండలతో తాను మరోసారి గెలువబోతున్నానని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధిష్టానం పార్టీ టికెట్‌ను కేటాయించినప్పటి నుంచి ప్రచారంలో దూసుకుపోతూ ప్రతిపక్షాలకు అందనంత దూరంలో ఉన్నానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రచారం తీరు, గెలుపు అవకాశాలపై ఆయన సోమవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. నాడు డివిజన్ కేంద్రంగా ఉన్న నిర్మల్‌ను నేడు జిల్లా కేంద్రమైంది. నిర్మల్‌కు మెడికల్ కాలేజీ తీసుకొచ్చా. కొత్తగా పొన్కల్, బీరవెల్లి మండలాలను ఏర్పాటు చేసుకున్నం. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీ -27 పనులు పూర్తి చేసుకొని నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలకు సాగునీరందించాను. వేల కోట్లతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో ఎన్నికల ప్రచారం కోసం ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రజల రెస్పాన్స్ చూస్తే తన గెలుపు ఖాయమైపోయిందనిపిస్తున్నది. నిర్మల్ ప్రజలతో తనకు సుదీర్ఘకాలం నుంచి ఉన్న అనుబంధంతో పాటు పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తన గెలుపుకు నాంది కాబోతున్నాయన్నారు. ప్రతిపక్షాలు కేవలం రాజకీయ ప్రయోజనాన్ని పొందేందుకు దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయని, ప్రజలు వాటిని నమ్మబోరన్నారు.

**నమస్తే : ప్రచారం ఎలా సాగుతోంది?**

**ఐకేఆర్ :** ప్రచారం బ్రహ్మాండంగా జరుగుతున్నది. ప్రతి గ్రామం, వార్డుల్లో ఓటర్లందరినీ నేరుగా కలుస్తున్నం. పదేళ్లుగా మంత్రి పదవిలో ఉండడం వల్ల ప్రజలతో డైరెక్టుగా సంబంధాలు ఉన్నయి. ప్రతిపక్షాల అభ్యర్థులకు నాయకులు లేరు, కార్యకర్తలు లేరు. మనతో పోలిస్తే వారి ప్రచారం 20 శాతం కూడా పూర్తి కాలేదు. ప్రచారంలో ఎక్కడికెళ్లినా బీఆర్ఎస్‌కే ఓటేస్తమని ప్రజలు స్పష్టం చేస్తున్నరు.

**నమస్తే : ప్రచారంలో మీ మనసుకు హత్తుకునే ఘటనలు ఉన్నాయా?**

**ఐకేఆర్ :** ప్రచారంలో భాగంగా ఎక్కడికెళ్లినా వృద్ధులు, వితంతులు, వికలాంగులు, రైతులు కేసీఆర్ సార్ మమ్మల్ని ఆదుకున్నడు. మేము ఇంత ధైర్యంగా ఉంటున్నామంటే అది కేసీఆర్ వల్లనే అంటూ చెప్పడం సంతృప్తినిచ్చింది. లబ్ధిదారులు కేసీఆర్‌కు రుణపడి ఉన్నామని, కచ్చితంగా మళ్లీ సీఎంగా కేసీఆర్ ఉంటేనే మా బతుకులకు భరోసా అని చెబుతున్నారు. 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు ఇవ్వడంతో రూపాయి అప్పు లేకుండా ఆనందంగా ఉన్నామని చెప్పినప్పుడు హృదయం చలించిపోతున్నది. ప్రతి పల్లెలో చక్కని రోడ్లు, డ్రైనేజీలు, పచ్చని చెట్లతో ఒక ఆహ్లాదకర వాతావరణం ఉంది. పదేండ్లలో ఇంతగా అభివృద్ధి చేసిన ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేదు.

**నమస్తే : నియోజకవర్గంలో ప్రధానంగా ఏం అభివృద్ధి చేశారు?**

**ఐకేఆర్ :** నిర్మల్ జిల్లాను, మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడం, అన్ని గ్రామాలు, పట్టణాల్లో వందల కోట్లతో అభివృద్ధి పనులు పూర్తవడంతో ప్రజలు కేసీఆర్ ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్నారు. అలాగే రూ.300 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ కోసం శంకుస్థాపన చేసుకోవడం, కాళేశ్వరం 27వ ప్యాకేజీ పనులను పూర్తి చేయడం, రూ.1,200 కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మించుకోవడంతో నాణ్యమైన కరెంటును ఇవ్వగలుగుతున్నం. ఇవన్నీ నా జీవితంలో మర్చిపోలేని పనులు.

**నమస్తే : మళ్లీ గెలుపొందిన తర్వాత చేపట్టబోయే అభివృద్ధి ఏమిటీ?**

**ఐకేఆర్ :** గతంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినం. రాబోయే రోజుల్లో నిర్మల్‌లో ఒక ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలి. నిర్మల్ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తామని ప్రజలకు హామీలిస్తున్నం. సీఎం కేసీఆర్ అడిగినవన్నీ నెరవేరుస్తానని హామీనిచ్చారు. రైల్వే లైన్ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానివి అన్ని గాలి మాటలే. ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వే లేన్ మంజూరు చేస్తామని చెబితే, రాష్ట్ర వాటా కింద 50 శాతం నిధులిస్తమని చెప్పి స్వయంగా సీఎం కేసీఆరే లెటర్ ఇచ్చారు. అయినా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు. అలాగే బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి 'ప్రసాద్' స్కీం కింద నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపినా కేంద్రం పట్టించుకోవడం లేదు. అంతే కాకుండా కేంద్రీయ విద్యాలయం, నవోదయ పాఠశాల, సైన్స్ సెంటర్, బీడీ కార్మికుల కోసం ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు చేయాలని కేంద్రానికి ఎన్నిసార్లు విన్నవించినా అతీగతీ లేకుండా పోయింది. నిర్మల్ అభివృద్ధికి నయా పైసా లాభం చేయని బీజేపీకి ఈ ప్రాంత ప్రజల ఓట్లడిగే హక్కులేదు.

**నమస్తే : మహిళలు, యువతకు ఏమైన ప్రత్యేక హామీలిస్తున్నారా?**

**ఐకేఆర్ :** మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద ప్రతినెల రూ.3 వేల గౌరవ భృతి ఇవ్వాలని, బీడీ కార్మికులకు కటఫ్ తేదీతో నిమిత్తం లేకుండా పీఎఫ్ నంబరున్న ప్రతి ఒక్కరికి పింఛన్ ఇస్తామని సీఎం కేసీఆర్ ఇప్పటికే హామీనిచ్చారు. స్థానిక యువత కోసం ఐటీ టవర్‌ను ఏర్పాటుకు కృషి చేస్తా. ఐటీ టవర్ ఏర్పాటైతే నిర్మల్ యువత ఇక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసుకోవచ్చు.

**నమస్తే : నియోజకవర్గంలో ప్రతిపక్షాల పరిస్థితి ఎలా ఉంది?**

**ఐకేఆర్ :** పదేళ్లుగా రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పటికీ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉన్నాను. కరోనా సమయంలో, వరదలు వచ్చినప్పుడు, ప్రజలు ఏ కష్టాల్లో ఉన్నా ప్రజల మధ్యనే ఉన్నా. ఇక్కడి బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి 2009-14 వరకు ఒకసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏనాడు ప్రజలకు అందుబాటులో లేడు. అమాస పున్నంకు నియోజకవర్గానికి వచ్చే మహేశ్వర్‌రెడ్డిని ప్రజలు సండే ఎమ్మెల్యే అని పేరు పెట్టారు. నిర్మల్ పేరిట ఇంజినీరింగ్ కాలేజీ తెచ్చుకొని అమ్ముకున్నడు. మెడికల్ కాలేజీ పెట్టి అది కూడా అమ్ముకున్నడు. మేం ప్రజల కోసం మెడికల్ కాలేజీ తెస్తే, ఆయన స్వలాభం చూసుకొని అమ్ముకున్నడు. ఆయన ఏనాడు ప్రజల ప్రయోజనాల గురించి ఆలోచించలేదు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావ్‌కు బీఆర్ఎస్ పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చింది. అయినా గెలవలేదు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిండు. ఎన్నికలప్పుడు మాత్రమే నిర్మల్ ప్రజలు వీరికి గుర్తుకు వస్తారు. మళ్లీ ఎన్నికలు కాగానే పత్తాలేకుండా పోతారు. అందుకే వీరిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు.

**బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై ప్రజల్లో స్పందన ఎలా ఉంది?**

**ఐకేఆర్ :** ఎక్కడికెళ్లినా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో బ్రహ్మాండంగా ఉందంటున్నారు. భారత దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రజలు మంచి జీవనాన్ని కొనసాగించేలా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ఉంది. దానిని ఎలాగైనా అమలు చేసి తెలంగాణ ప్రజలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ తపన. సీఎం హామీ ఇచ్చారంటే తప్పకుండా అమలు చేస్తారన్న నమ్మకం ప్రజల్లో ఉండబట్టే బీఆర్ఎస్‌కు పెద్ద ఎత్తున మద్దతు పలుకుతున్నరు. గత పదేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి, రాబోయేరోజుల్లో నిర్మల్ మరింత అభివృద్ధి సాధించాలంటే ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేసి మరోసారి ఆశీర్వాదించాలని ప్రతి ఒక్కరిని అభ్యర్థిస్తున్నాను.

## ఎన్నికల వేళ 'ఏలేటి' కుతంత్రం

- మైనార్టీల ఇలాఖాలో గొడవలకు ప్లాన్
- ఓటమి భయంతో బీఆర్ఎస్ శ్రేణులపై భౌతిక దాడులు
- ఐకే రెడ్డిని ఎన్నికల్లో ఎదుర్కోలేక కుట్రలు
- గత ఎన్నికల్లోనూ ఇలాంటి డ్రామాలే..
- ప్రజలు బుద్ధి చెప్పినా తీరు మారని మహేశ్వర్‌రెడ్డి

మంచిర్యాల, నవంబర్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మరో రెండు రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డి కొత్త కుట్రలకు తెరలేపారు. ఓటమి భయంతో నిర్మల్ ప్రజల్లో అలజడి సృష్టించేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. నిర్మల్ పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో ఓ వర్గం వారు ఎక్కువగా నివాసం ఉంటున్నారు. బీజేపీకి ఏ మాత్రం పట్టు లేని ఈ కాలనీకి ఇప్పటివరకు బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ నాయకులు ప్రచారానికి వెళ్లలేదు. ముందస్తుగా పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన మంగళవారం బీజేపీ నాయకులు కావాలనే వైఎస్ఆర్ కాలనీకి వెళ్లినట్లు తెలుస్తున్నది. బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి భారీ సంఖ్యలో తన అనుచరులతో కలిసి నినాదాలు చేయడంతో కాలనీవాసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ కార్యకర్తలు కాలనీ ప్రజలపై ఎదురు దాడికి దిగారు. స్థానిక ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచి వారిని కాపాడారు. ముందస్తు వ్యూహంతోనే బీజేపీ నాయకులు ఎలాగైనా సరే గొడవలు సృష్టించి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఉద్దేశంతోనే చివరి రోజు తమ ప్రచారానికి వైఎస్ఆర్ కాలనీని ఎంచుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ శ్రేణులపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు భౌతిక దాడులకు దిగడంతో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గాయపడ్డారు. అయితే ఉల్టా చోర్ కోత్వాల్‌కు డాంటే అన్నట్లు దాడి చేసిందే కాక, తమపైనే బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారని బుకాయిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డిని ఎన్నికల్లో ఎదుర్కోలేక మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలకు తెరలేపుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో కూడా పోలింగ్‌కు ఒక రోజు ముందు ఇలాంటి జిమ్మిక్కులకు యత్నించినప్పటికీ మహేశ్వర్‌రెడ్డికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు. అయినా తీరు మారని మహేశ్వర్‌రెడ్డి ఈసారి కూడా ప్రజల్లో భయాందోళనలు సృష్టించే కుట్రలకు పాల్పడడంపై నియోజకవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బీజేపీ కార్యకర్తల దాడిలో గాయపడ్డ బీఆర్ఎస్ కార్యకర్తను ఆటోలో దవాఖానకు తరలింపు

## ఓడిపోతామనే భయంతోనే బీజేపీ దాడులు



బీఆర్ఎస్ నేతలపై జరిగిన దాడి దృశ్యాలను చూపిస్తున్న మంత్రి అల్లోల

నిర్మల్ అర్బన్, నవంబర్ 28 : బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన ప్రజాదారణను చూసి ఓర్వలేక ఓడిపోతామనే భయంతో బీజేపీ నేతలు పార్టీ శ్రేణులపై దాడులు చేయించారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్‌లోని విశ్వనాథ్‌పేట్ కాలనీలో బీఆర్ఎస్ శ్రేణులపై జరిగిన దాడిని మంత్రి ఖండించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీజేపీ అభ్యర్థి మహేశ్వర్ రెడ్డి ఇరువర్గాల ప్రజలను రెచ్చగొట్టి వారి మధ్య చిచ్చుపెట్టి ఓట్లను దండుకునే నీచ సంస్కృతికి తెరలేపాడని అక్కడ జరిగిన దాడి ఘటన దృశ్యాలను మీడియాకు చూపించారు. బీఆర్ఎస్ నేతలపైనే బీజేపీ నేతలు కర్రలు, రాళ్ళతో దాడి చేశారని ఇందుకు వీడియోలే నిదర్శనమని చూయించారు. ప్రశాంతమైన నిర్మల్‌లో ఇలాంటి భయానక పరిస్థితులను తీసుకురావడం బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డికి కొత్తేమి కాదని అన్నారు. గత ఎన్నికల్లో సైతం ఇలాంటి ఘటనలకు తెరలేపాడని నిర్మల్‌లో ఆలజడి లేపి ఓ వర్గం ఓట్లతో లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారని దాడి ఎవరు జరిపా రో..దానికి కారణం ఎవరో నిర్మల్ ప్రజలకు తెలుసని అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక ప్రజలను తప్పుదోవ పట్టించి వారిని రెచ్చగొట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారికి ఓటుతోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు సంయమనం పాటించాలని నిర్మల్‌లో ఎగిరేది గులాబీ జెండానే అని అన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

CHANGE OF NAME

I, **AKBAR ALI** (Old Name) S/o **ISAQ**, Age:42 Yrs, Occ: Govt. Employee R/o. H.No.4-7-259, Vidya Nagar, New RTC Bus Depo, Adilabad Town. is hereby Declare That I shall be called as **MD.AKBAR ALI** hence Declared.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677